క్లుప్తంగా

నేడు విద్యాసంస్థల బంద్

చేవెళ్ల: విద్యారంగ సమస్యల పరిష్కారానికి నేడు బుధవారం విద్యాసంస్థల బంద్‌కు పీడీఎస్‌యూ, వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపును విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజేశ్ కోరారు. మండలకేంద్రంలో మంగళవారం పీడీఎస్‌యూ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేజీ టు పీజీ ఉచిత విద్యను గాలికి వదిలేసిందన్నారు. పిల్లలు తక్కువ ఉన్నారన్న నెపంతో కొన్ని వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులిస్తూ, ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. విద్యారంగ సమస్యల సాధనకు జూలై 12వ తేదీన వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కి పిలుపునిచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, కళాశాల యాజమాన్యలు స్వచ్ఛందంగా సహకరించి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

అరక ఒక్కటి.. గుంటుకలు రెండు..



వెంకమ్మగూడ శివారులో ఒకే అరకకు రెండు దంతెలు తోలుతున్న తండ్రి, కొడుకు

నందిగామ: వారు తండ్రి కొడుకులు.. వారికి ఉన్న రెండు ఎద్దులతో కేవలం ఒక అరక మాత్రమే తొలగలరు.. పని ఎక్కువగా ఉంది.. ఒక అరకతో పని పూర్తికావలంటే సమయం ఎక్కువగా పడుతోంది. అంతలోపు వర్షం కురిస్తే ఇక అంతే.. దీంతో వారు వినూత్నంగా ఆలోచించారు. ఒకే అరకతో రెండు గుంటుకలు(పత్తి చేనులో కలుపు తొలగించుటకు వాడే పని ముట్టు) ఏర్పాటు చేసుకుని దంతెలను తోలుతున్నారు. దీంతో రెండు రోజుల్లో చేసే పని కేవలం ఒకే రోజు పూర్తవుతుందని తండ్రి కొడుకులు మల్లేష్, నందులు తెలిపారు. ఈ దృశ్యం నందిగామ మండలం వెంకమ్మగూడ శివారులో మంగళవారం సాక్షి కెమెరాకు చిక్కింది.

కుంగ్‌ఫూ పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కొత్తూరు: నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ఈ నెల 10న ఉషు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంగ్‌ఫూ పోటీల్లో మండలానికి చెందిన పలువురు విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభ కనబర్చినట్లు కుంగ్‌ఫూ మాస్టర్ హాజి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

అభివృద్ధి అంతంత మాత్రమే

బీఎస్పీ జిల్లా కార్యదర్శి అబ్రహం లింకన్



మాట్లాడుతున్న అబ్రహం లింకన్

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి అంతంత మాత్రమేనని, ఏ గ్రామానికి వెళ్లిన రోడ్లు గుంతలు పడి అధ్వానంగా ఉన్నాయని బహుజన బీఎస్పీ జిల్లా కార్యదర్శి అబ్రహం లింకన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాల రోడ్లు పూర్తిగా దెబ్బ తిని ప్రమాదాలకు నిలయంగా మారాయని ఆరోపించారు. ఏ గ్రామానికి వెళ్లి చూసిన గతుకుల రోడ్లు ప్రమాదకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు బీఆర్ఎస్ పార్టీ తుంగలో తొక్కిందని విమర్శించారు. తొమ్మిది సంవత్సరాల పాటు కాలయాపన చేస్తూ కాలాన్ని గడుపుతూ అభివృద్ధిలో ఏ మాత్రం ముందుకు సాగలేదని మండిపడ్డారు. విద్యాభివృద్ధిలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గతంలో గురుకులాల మెరుగు కోసం ఎంతో కృషి చేశారన్నారు. ప్రస్తుతం గురుకులాలు వివిధ సమస్యలతో సతమతమవుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం గురుకులాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి రాజమహేంద్ర వర్మ, అసెంబ్లీ అధ్యక్షుడు చందు పాల్గొన్నారు.

మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా ఏవీ రంగా

మొయినాబాద్: మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా ఏవీ రంగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన డీకే లక్ష్మీరెడ్డి షాద్‌నగర్ రూరల్ సీఐగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఐజీ ఆఫీస్ నుంచి ఏవీ రంగా మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చారు. డీకే లక్ష్మీరెడ్డికి సోమవారం రాత్రి పోలీసులు సిబ్బంది ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు.

బోనాల సంబురం

ఆషాఢమాసం బోనాల ఉత్సవాలు మంగళవారం చేవెళ్ల నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మహిళలు గ్రామ పురవీధుల గుండా బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయాలకు చేరుకొని గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. అనంతరం వర్షాలు బాగా కురవాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాలు భక్తులతో కిక్కిసిపోయాయి. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పునకాలు, డిల్లెం పెల్లెం చప్పుళ్ల మధ్య మహిళలు బోనాల ఊరేగింపు సాగింది. – సాక్షి, నెట్‌వర్క్



మొయినాబాద్‌రూరల్: ముర్తుజాగూడలో బోనాల ఉత్సవాల ర్యాలీ



షాబాద్: బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు



శంకర్‌పల్లి: బుల్కాపూర్‌లో బోనాలు ఉత్సవాలు

కాంగ్రెస్‌ది దుర్మార్గపు ఆలోచన

ఉచిత విద్యుత్ రద్దుపై జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ ఫైర్



మాట్లాడుతున్న ఈట గణేశ్

నందిగామ: రాష్ట్రంలోని రైతన్నలకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్‌ను రద్దు చేయాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం దుర్మార్గపు ఆలోచన అని జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో మంగళవారం ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి కేవలం మూడు గంటలు మాత్రమే విద్యుత్ సరిపోతుందని రేవంత్ వ్యాఖ్యనించడం తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. రేవంత్ వ్యాఖ్యల పట్ల తమ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల విద్యుత్‌ను ఇస్తుంటే.. కాంగ్రెస్ పార్టీ నాయకులు తట్టుకోలేక పోతున్నారని మండిపడ్డారు. రైతులకు గతంలో సరిపడా విద్యుత్‌ను ఇవ్వకుండా గోస పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దేనని ఆరోపించారు. కార్యక్రమంలో చేగూరు మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, నాయకులు కృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష సాయం అందించాలని వినతి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘం నాయకులు

షాద్‌నగర్ రూరల్: బీసీ కులాల్లో కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారందరికీ ప్రభుత్వం లక్ష సాయం అందించాలని కోరుతూ.. మంగళవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ కులాల్లో ఎంతో మంది కులవృత్తులనే నమ్ముకొని జీవిస్తున్నారని అన్నారు. కులవృత్తులతో ఆదాయం లేకపోవడంతో బీసీలు ఆర్థికంగా వెనుకబడిపోతున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ 28వ వార్డు బీసీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు రవి, రాజు, వెంకటేశ్, రవి, సతీష్, హరి, సాయి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

ఏబీవీపీ నాయకుడు శ్రీకాంత్



ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

షాబాద్: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తోందని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ సందీపానీ ఇన్‌చార్జి బర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ధాన్యహిత పాఠశాలలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థుల సమస్యల పరిష్కారానికి 1949వ సంవత్సరంలో ప్రొఫెసర్ జయ శంకర్ నారాయణ కేవలం 5మంది సభ్యులతో ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. విద్యార్థి సంఘం నేడు దేశం మొత్తంలో విద్యార్థుల సమస్యలపై పోరాడే ఏకైక సంస్థ ఏబీవీపీ మాత్రమేనన్నారు. ప్రైవేట్ పాఠశాలలో ఐఐటీ పేరుతో అధిక ఫీజులు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ప్రవీణ్, వేణుగోపాల్, మధు, కిరణ్, విజయ్, రాకేష్, నందు, తదితరులున్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

సీఐటీయూ నాయకుడు చంద్రమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమోహన్

మొయినాబాద్: మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు ఇవ్వొద్దనే డిమాండ్‌తో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ కోరారు. సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు మంగళవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చంద్రమోహన్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. ఎన్నో ఏళ్లుగా మధ్యాహ్న భోజనం చేస్తున్న కార్మికులను ప్రభుత్వం తొలగించి పథకాన్ని అక్షయపాత్ర సంస్థకు అప్పగించడం సరికాదన్నారు. కార్మికుల పొట్టగొట్టే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు కలెక్టరేట్ ముట్టడికి కార్మికులంతా పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సీఐటీయూ మండల నాయకుడు రత్నం, కార్మికులు విజయలక్ష్మి, మారతమ్మ, లక్ష్మమ్మ, సుధా పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే



స్వచ్ఛ సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కేశంపేట: స్వచ్ఛ సర్వేక్షణ్ జాతీయ అవార్డుకు జిల్లా నుంచి 14 గ్రామ పంచాయతీలను ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. కేశంపేట మండలం నుంచి కేశంపేట గ్రామం ఎంపికైనట్లు మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో భాంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఇంటి ఆవరణలో కిచెన్‌గార్డెన్, ఇంకుడు గుంతల గూర్చి తెలుసుకుంటున్నారు. అలాగే, వ్యక్తిగత మరుగుదొడ్లు, తడిపొడి చెత్త సేకరణ గురించి వివరాలను సేకరిస్తున్నారు. ఈ వివరాల ఆధారంగా ఉన్నతాధికారులు గ్రామంలో తనిఖీలు నిర్వహించి గ్రామ పంచాయతీని జాతీయ అవార్డుకు సిఫారసు చేయనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు విద్యావతి, స్నేహలత, వరలక్ష్మి, సౌమ్య, లక్ష్మీప్రసన్న, విజయ, శేఖర్, రవీందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ' సేవలతో మేలు

మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత



మహిళలను పరీక్షిస్తున్న డాక్టర్ నిఖిత

కేశంపేట: మహిళల ఆరోగ్య సమస్య పరిష్కారానికి ప్రభుత్వం 'ఆరోగ్య మహిళ' కార్యక్రమం నిర్వహిస్తుందని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత సూచించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిఖిత మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళ శిబిరంలో 18 సంవత్సరాలు పైబడిన మహిళలను పరీక్షించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న మహిళలకు అవసరమైన పరీక్షలను నిర్వహించి, రోగ నిర్ధారణ అనంతరం ఉన్నత స్థాయి ఆస్పత్రికి సిఫారసు చేయడం జరుగుతుందని ఆమె చెప్పారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో డయాగ్నొస్టిక్, క్యాన్సర్ స్క్రీనింగ్, సూక్ష్మపోషక లోపాలు, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు, కుటుంబ నియంత్రణ, ఋతుస్రావ సమస్యల నిర్వహణ, మెనోపాజ్ నిర్వహణ, లైంగిక వ్యాధులు, శరీర బరువులాంటి సమస్యలపై సేవలను అందించడం జరుగుతుందని తెలిపారు. మండలంలో 76 మంది మహిళలకు రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా అందులో వచ్చిన రిపోర్టు అధారంగా ముగ్గురిని పెద్ద ఆస్పత్రికి పంపించడం జరిగిందని డాక్టర్ నిఖిత తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆంజనేయులు, సుందరి, నాగమ్మ, హేమలత, సుదీప్తి, రాగశ్రీ, జ్యోత్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మూల విరాట్‌కు నాలుగున్నర కిలోల వెండి అభరణాలు చేయించేందుకు మంగళవారం మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుకు రూ.3.50లక్షల చెక్కును అందజేశారు. అనంతరం నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. అందరు ఆ ద్యాత్మిక చింతను అలవర్చుకోవాలని అన్నారు. భక్తితోనే ముక్తి లభిస్తుందని చెప్పారు. స్వామివారి ఆ శీస్సులు అందరిపై ఉండాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, మాధవి, రవీందర్, దామోదర్‌రెడ్డి, శివాచారీ, రమేష్, గణేష్, రాఘవేందర్ పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధిలో రాష్ట్రం ముందంజ

ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్ల: ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఇతర నాయకులు

చేవెళ్ల: సంక్షేమాభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే ముందంజలో ఉందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని దేవరంపల్లిలో మంగళవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య శుభోదయం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరహరిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ గ్రామంలోని సమస్యలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అన్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పూర్తయిన సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంట్, ఆసరా పింఛన్‌లు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, తదితర పథకాలను ప్రజలకు అందిస్తున్న ఘతన కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గ్రామంలో సీసీ రోడ్లకు రూ.30లక్షల నిధులు ఇవ్వాలని సర్పంచ్ నరహరిరెడ్డి ఎమ్మెల్యేను కోరారు. సమస్యల పరిష్కరానికి తన వంతు కృషిని చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల బోర్డు చైర్మన్ నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం.మాలతి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, ఎంపీటీసీ వాసవీ, ఉప సర్పంచ్ మల్లేశ్, గ్రామ నాయకులు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాధ్యత కుటుంబాలను ఆదుకుంటాం

షాబాద్: ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మంగవారం షాబాద్ మండలం రేగడి దోస్వాడకు చెందిన కె.మల్లేష్‌కు రూ.1లక్ష 50వేల రూపాయల ఎస్‌ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం బాధ్యతగా తీసుకుంటామని చెప్పారు. తెల్ల రేషన్‌కార్డు, ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఎంతో మంది నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు.


పరిమిత కుటుంబమే లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు

శంకర్‌పల్లి /చేవెళ్ల: చిన్నకుటుంబమే చింతలేని కుటుంబమని చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ దామోదర్ అన్నారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శంకర్‌పల్లి మండల కేంద్రంలోని శంకర్‌పల్లి, టంగుటూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పరిమిత కుటుంబమే లక్ష్యంగా ఉండాలని ఒక్కరు ముద్దు ఇద్దరు వద్దని చెప్పారు. అమ్మాయి అయినా అబ్బాయి అయినా వివాహ వయస్సు వచ్చే వరకు పెళ్లి చేయొద్దని సూచించారు. ప్రపంచ జనాభా రోజురోజుకూ పెరిగిపోతుందని చెప్పారు. భారత దేశ జనాభా మొదటిస్థానంలోకి వెళ్తుందని దీనిని గుర్తించి జనాభా నియంత్రణ పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది. ఆశలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు ప్రజలకు వివరించాలి



గడపగడపకూ ప్రచారంలో నేతలు

చేవెళ్ల: ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కమిటీ, నియోజకవర్గం నాయకులు కంజర్ల ప్రకాశ్ అన్నారు. మండలంలోని చనువెల్లి, ఇక్కారెడ్డిగూడ గ్రామాల్లో మంగళవారం గడపగడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ.. బీజేపీ 9ఏళ్ల పాలనలో నరేంద్రమోడీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో కూడా బీజేపీకి అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డి, అంజనేయులుగౌడ్, శర్వలింగం, శ్రీనివాస్, శ్రీపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్



పార్టీలో చేరిన కాస్లాబాద్ గ్రామస్తులతో శంకర్

కొందుర్గు: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ కార్యకర్తలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం కాస్లాబాద్, ఎదిర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో బీఆర్ఎస్, బీజేపీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులను పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే రైతులకు, పేదలకు న్యాయం జరిగిందని, తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్, బీజేపీలపై ప్రజలకు నమ్మకం పోయిందని, దీంతో కాంగ్రెస్‌లో స్వచ్ఛందగా చేరుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కావలి రాజు. నాయకులు రాములు, వెంకటయ్య, యాదయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బలహీన వర్గాల అభ్యున్నతి

షాద్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్



నియామక పత్రం అందజేస్తున్న బాల్‌రాజ్‌గౌడ్

షాద్‌నగర్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని షాద్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని భీమారంలో ఆ పార్టీ బీసీ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయ్యాయరని ఆరోపించారు. రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుందని, ఈ పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ కమిటీ సభ్యులు కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేలా కృషి చేయాలని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలని అన్నారు. గ్రామ బీసీ కమిటీ అధ్యక్షుడిగా వీరేశం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్యం, ఉపాధ్యక్షుడిగా మల్లయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, కార్యదర్శి శ్రీశైలం, కోశాధికారిగా వీరయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీశైలం, బసప్ప, లక్ష్మయ్య, సత్యం, నర్సింలు, యాదయ్య, బాబా, యాదయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సాయిలు



సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న సాయిలు

కేశంపేట: న్యాయబద్ధమైన గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొత్తపేట సాయిలు అన్నారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం 5వ రోజుకు చేరింది. సమ్మెకు కాంగ్రెస్ తరఫున బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొత్తపేట సాయిలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మల్టీపర్పస్ విధానాన్ని తొలగించి గ్రామ పంచాయతీ కార్మికులుగా గుర్తించాలన్నారు. పేస్కేల్‌ను అందించి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు రాంచంద్రయ్య, యాదయ్య, మల్లయ్య, అంజయ్య, చంద్రయ్య, భిక్షమయ్య, పద్మమ్మ, రాములమ్మ, నర్సమ్మ, జంగమ్మలు పాల్గొన్నారు.